# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 130    VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy    సంపాదకులు : కె.భాస్కర్‌రావు    రూ.2.00/- పేజీలు 8    తేది: ఆదివారం 31 మే 2026





పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం: మంత్రి ఉత్తమ్



## దాడి వెనుక కుట్ర కోణం

**సమయం ప్రతినిధి:** సోనార్‌పూర్‌లో (పశ్చిమబెంగాల్) టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై శనివారం జరిగిన దాడిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఖండించారు. రాజకీయ భేదాభిప్రాయాలున్నంత మాత్రాన హింసకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన హింసాత్మక ఘటనల బాధితులను పరామర్శించేందుకు టీఎంసీ ఎంపీ శనివారం సోనార్‌పూర్ వెళ్లిన సందర్భంగా కొందరు కోడి గుడ్లు, రాళ్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిని తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా ఖండించారు. ఆయనకు తగినంత పోలీసు భద్రత లేకపోవడాన్ని బట్టి బీజేపీ రాజకీయాలు, ప్రతీకారాలను అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రతిపక్ష నేతల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు, సమాజ్ వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కూడా అభిషేక్ బెనర్జీపై దాడిని ఖండించారు. తాము ఎంతటి ద్వేషపూరిత రాజకీయాలకైనా దిగగలమని బీజేపీ ఈ దాడితో రుజువు చేసిందని వ్యాఖ్యానించారు.




## మరో పరీక్షలో సమస్య! కేంద్రంపై విమర్శలు

**సమయం ప్రతినిధి:** డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్‌ల కోసం ఉద్దేశించిన జాతీయ స్థాయి కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు (సీయూఈటీ) సాంకేతిక సమస్య కారణంగా నేడు పలు చోట్ల ఆలస్యంగా ప్రారంభమైంది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కూడా కేంద్ర ప్రభుత్వంపై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. నాలుగు పరీక్షలు.. కోటి మంది విద్యార్థులు.. కానీ ఒక్క పరీక్ష కూడా నిజాయతీగా నిర్వహించలేకపోయారు' అని ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. సాంకేతిక సమస్య కారణంగా సీయూఈటీ పరీక్ష పలు చోట్ల ఆలస్యంగా ప్రారంభమైందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. ఈ మేరకు మధ్యాహ్నం షిఫ్టుల్లో కూడా మార్పులు చేశామని వెల్లడించింది. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షను 4 గంటలకు మార్చినట్టు తెలిపింది. జాతీయ, రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలతో పాటు కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో వివిధ విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి అడ్మిషన్ల కోసం ఎన్‌టీఏ సీయూఈటీ పరీక్షను నిర్వహిస్తోంది. వివిధ దశల్లో సాగే ఈ పరీక్ష ఈ ఏడాది మే 11 నుంచి మే 31 వరకూ జరగనుంది.



## ప్రమాణస్వీకారం తేదీ ఖరారు..

**సమయం ప్రతినిధి:** కర్ణాటక కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నికైన డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు అధికారికంగా తేదీ ఖరారైంది. జూన్ 3న కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం ప్రకటించారు. సీఎల్‌పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నికైన అనంతరం మీడియాతో ఆ వివరాలను కేసీ వేణుగోపాల్ పంచుకున్నారు. సీఎల్‌పీ నేతగా డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు చెప్పారు. డీకే పేరును కాంగ్రెస్ అధిష్టానం సూచించగా, తొలుత సిద్ధరామయ్య, ఆ తర్వాత పరమేశ్వర ఆయన పేరును సీఎల్‌పీ సమావేశంలో ప్రతిపాదించారని, ఏకగ్రీవంగా దీనికి ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారని వివరించారు. ముఖ్యమంత్రి మార్పు కాంగ్రెస్ పార్టీకి సమస్య అవుతుందని అంతా భావించారనీ, అయితే తమదంతా ఒక కుటుంబమని, అంతా ఏకగ్రీవంగా ఈ ఎన్నికను ఆమోదించడం పార్టీకి గర్వకారణమని అన్నారు. 2028లోనూ నాయకులందరికీ సపోర్ట్‌తో కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే స్పష్టమైన నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.**

**సమయం ప్రతినిధి :** లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని విమర్శించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం నీరు లేకపోవడం ఆందోళనకర విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన సాగునీటిని అందించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.

**తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.**



## రైతు ముసుగులో రాజకీయం..

**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర (మీస్రా) ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్తే, తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు.

అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం, హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.






### కాంట్రాక్టు వ్యవస్థలో అన్యాయం జరుగుతోంది..

## ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** నగరంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ.. కాంట్రాక్టర్ల సమస్యలు, హామీల అమలు తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'కేసీఆర్ హయాంలో అధికారులకు స్వేచ్ఛనిచ్చి పని చేయమని చెప్పారు. ఒక్కో విద్యార్థి మీద ప్రత్యేక దృష్టి పెట్టి తొమ్మిదిన్నర ఏళ్ళు చదివించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చారు. రేవంత్.. పేమెంట్ కోటాలో సీఎం పదవి తెచ్చుకున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుడతారా అని సీఎం అంటున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుట్టరని తెలుసు.. 30నెలల్లో కూడా పిల్లలు పుట్టకుంటే ఏమంటారు? కాంట్రాక్టులన్నీ సీఎం బామ్మర్దికి, మంత్రి పొంగులేటి కొడుకుకు వస్తున్నాయి. ముఖం బాగాలేక అద్దం పగుల కొట్టినట్లు ఉంది పరిస్థితి . కేసీఆర్ అప్పుల పాలు చేశారు అంటున్నాడు. కేసీఆర్ అప్పు చేసి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారు. ఢిల్లీకి పోదాం.. జీవో నెంబర్ 17 రద్దు అయ్యేవరకు పోరాడుదాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.

# సంపాదకీయం

## మోదీని రాహుల్ జయించగలడా?

గత సార్వత్రిక ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకు యువ కాంగ్రెస్ శాసనసభ్యుడు ఒకరు నాకు తటస్థించారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీకి ఐదు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. నేను ఇవ్వగల సలహా ఒక్కటే ఉన్నదని చెప్పాను: వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రియాంకగాంధీ పోటీ చేయకూడదు. నా యీ సలహాను నిర్లక్ష్యం చేస్తారని నిశ్చితంగా చెప్పగలను అని ముక్తాయించాను. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఆయన నాయకత్వం పట్ల విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా భాసించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ జమీగా అయిపోవడంతో భారత్ జోడో యాత్ర సత్ఫలితాలు వ్యర్థమైపోయాయి. ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక వాగాడంబరం ప్రదర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను ప్రధానమంత్రి కాబోయే వ్యక్తి అని కీర్తించడం ప్రారంభించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనతో ఏకీభవించారు. రెండు సంవత్సరాల తరువాత వెనుతిరిగి చూస్తే వారి ఆనందోత్సాహాలు తొందరపాటుతో కూడుకున్నవని అనిపిస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కేవలం ఒకే ఒక్క రాష్ట్రం– కేరళలో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. ఒకప్పుడు కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానాలో బీజేపీ స్వతస్సిద్ధ పాలకపక్షంగా భాసిల్లుతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేకపోతున్నారు. 2008లో కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆయన లాంఛనంగా చేపట్టినప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శాసనసభ్యుల సంఖ్య 1204 నుంచి ఇప్పుడు 676కి పడిపోయింది.రాహుల్‌గాంధీని స్వయంగా కలిసి మాటా మంతీ జరిపాను. ఆయనతో నేను ఉత్తర ప్రత్యుత్తరాలూ సాగించాను. జవహర్‌లాల్ నెహ్రూ మునిమనవడు సద్వర్తనుడు, సందేహం లేదు. ఈ కొద్ది పాటి పరిచయం కూడా లేకపోయినప్పటికీ ఆయన పట్ల నాకు అపార సానుభూతి ఉండేది. ఆయన లోనైన వ్యక్తిగత విషాదాలే ఆ సానుభూతిని కలిగించాయి. యాభై ఐదు సంవత్సరాల వయసులో ఉన్న రాహుల్ తన తల్లి సంకల్పసాధనకు ఒక సాధనంగా మిగిలిపోయాడు. సోనియాగాంధీ ఆదేశం మేరకే ఆయన రాజకీయాలలో ప్రవేశించారనే విషయంలో ఎవరికీ సందేహం లేదు. ఆమె చెప్పిన విధంగానే కాంగ్రెస్‌కు సారథ్యం వహిస్తున్నారు. అయితే మన గణతంత్ర రాజ్యం మౌలిక విలువలు, మనుగడ ప్రమాదంలో పడిన ప్రస్తుత సందర్భంలో ప్రజాచర్చ మారాలి. అది స్పష్టంగా, కఠినంగానే కాకుండా క్రూరంగా కూడా జరగాలి. రాహుల్‌గాంధీ మంచి మనిషి, ఉత్తమ భారతీయుడే. అయితే బీజేపీ విద్వేషపాలనను అంతమొందించేందుకు ఆరాట పడుతున్నవారు తమ ప్రధాన ఆశాజ్యోతిగా రాహుల్‌ను చూడడాన్ని మానుకోవడం మంచిది. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీకి భావి సవాల్‌దారు అయిన రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు కొరవడ్డాయి. ఎన్నికల సంఘం పక్షపాత కార్యసరళి లాంటి సమస్యపై కూడా ఆయన నిర్విరామంగా పోరాడలేదు. 'ఓటు చోరీ'పై ఒకరోజు విలేఖర్ల సమావేశంలో పాల్గొని, మరుసటి రోజే యూరోప్ లేదా లాటిన్ అమెరికాకు వెళ్లిపోవడాన్నే దేశ ప్రజలు చూశారు. తన 22 ఏళ్ల రాజకీయ జీవితంలో భారత్ జోడో యాత్ర చేసిన కొద్ది నెలలు మాత్రమే ప్రజాసమస్యలపై ఆయన తదేక దీక్షతో శ్రద్ధ చూపడం జరిగింది. బీజేపీ నాయకులు అటువంటి దీక్షతో 365 రోజులూ రేయింబవళ్లు పనిచేస్తుంటారు. ఈ రోజుల్లో ఆయన తన రాజకీయ కార్యకలాపాలను చాలావరకు సామాజిక మాధ్యమాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఆయన పోస్ట్‌లకు వెన్వెంటనే లైక్‌లు వెల్లువెత్తుతాయి. అయితే ఆయన వ్యాఖ్యలు 24 గంటలలోపే పూర్తిగా విస్మృతమయిపోతున్నాయి! 2004లో లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికవక ముందు రాహుల్ ఎక్కడైనా ఏదైనా ఉద్యోగం చేశారా లేదా అన్నది ఎవరికీ తెలియదు. యూపీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో మంత్రిపదవిని చేపట్టేందుకు ఆయన అంగీకరించలేదు. మరి ఆయన ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు ఎందుకు విశ్వసించాలి? గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని చేతకానితనం రాహుల్‌కు ఉన్నది. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధానమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని రాహుల్ కొనసాగిస్తున్నాడు. సందర్భవశాత్తు చాలా మంది పట్టించుకోని ఒక వాస్తవాన్ని చెప్పవలసి ఉన్నది: అధికారం వంశపారంపర్య హక్కు కాదనే విషయాన్ని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు నిరూపించాయి. అసోంలో తరుణ్ గొగోయ్ కుమారుడు కాంగ్రెస్ ప్రచారానికి నాయకత్వం వహించడం బీజేపీ విజయానికి దోహదం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్‌కు అగ్రప్రాధాన్యమివ్వడం ఆమెకే నష్టదాయకమైనది. తమిళనాడులో స్టాలిన్ తన కుమారుడు ఉదయనిధిని అందలాలు ఎక్కించడం విజయ్ విజయానికి విశేషంగా తోడ్పడింది. కేరళలో పినరయి విజయన్ తన అల్లుడిని ప్రమోట్ చేయడం కాంగ్రెస్ విజయానికి సహాయపడింది. ఆయా పార్టీల జయాపజయాలకు ఇంకా చాలా కారణాలు ఉన్నప్పటికీ వంశపారంపర్య రాజకీయాలకు ప్రజల తిరస్కృతి వాటిలో మరింత ముఖ్యమైనది. కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబంపై ఈ విమర్శలు, కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఏ విధంగాను సమర్థించడం కానే కాదు.

# రైల్వే స్టేషన్ సోలార్ పవర్ ఆదా...

హైదరాబాద్ : ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. పర్యావరణహితంగా ఇక్కడ ఉత్పత్తి అవుతున్న సోలార్ పవర్‌ను స్టేషన్ పరిధిలోని వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎస్పీడీసీఎల్ సరఫరా చేసే సాధారణ విద్యుత్‌తో పోలిస్తే సోలార్ విద్యుత్ యూనిట్ ధర సగానికి సగం తక్కువగా ఉండటంతో.. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ ఎలక్ట్రికల్ విభాగానికి సంవత్సరానికి లక్షల రూపాయల ప్రజాధనం ఆదా అవుతోంది. ఈ విభాగం కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ జాతీయ ఇంధన పొదుపు అవార్డును కూడా సొంతం చేసుకోవడం విశేషం.దక్షిణ మధ్య రైల్వే కాచిగూడ స్టేషన్‌లో విద్యుత్ కొనుగోలు కోసం2018లో ఢిల్లీకి చెందిన 'రెన్యూ పవర్స్ సిస్టమ్స్' సంస్థతో 25 ఏళ్ల పాటు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకుంది. ఇందులో భాగంగా యూనిట్‌కు రూ.5 చొప్పున సౌర విద్యుత్‌ను సరఫరా చేసేలా ఒప్పందం కుదిరింది. స్టేషన్ ప్లాట్‌ఫారాల భవనాలపై 200 కేడ బ్ల్యూపీ సామర్థ్యంతో రెండు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, వీటిపై సోలార్ ప్యానెళ్లను అమర్చారు. మొత్తం సోలార్ యూనిట్ల సామర్థ్యం 400 కేడబ్ల్యూపీగా ఉంది.


గణనీయంగా పెరిగిన విద్యుత్ ఉత్పత్తి..

స్టేషన్ అవసరాల కోసం లోపల 1200 బీఎల్‌డీసీ ఫ్యాన్లు, 3 వేల ఎల్‌ఈడీ విద్యుత్ బల్బులను వాడుతున్నారు. వీటి కోసం, శీతాకాలంలో రోజుకు సగటున 1300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత వేసవి కాలంలో ఎండల వల్ల ఈ ఉత్పత్తి రోజుకు 1700 యూనిట్లకు పెరిగింది.

ఏడాదికి రూ. 25 లక్షల ఆదా..

గత ఏప్రిల్ నెలలో ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా 43 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, కాచిగూడ స్టేషన్ అవసరాలకు 49 వేల యూనిట్లను వినియోగించారు. సోలార్ పవర్ పోను మిగిలిన 7 వేల యూనిట్లను మాత్రమే ఎస్పీడీసీఎల్ నుండి యూనిట్‌కు రూ.10 చొప్పున కొనుగోలు చేశారు. సాధారణ విద్యుత్ రేటుతో పోలిస్తే సగం ధరకే (రూ.5) సోలార్ పవర్ లభించడంతో ఒక్క ఏప్రిల్ నెలలోనే రైల్వేకు రూ.2.12 లక్షలు మిగిలాయి. ఈ లెక్కన దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్‌కు సౌర విద్యుత్ వినియోగం వల్ల ఏడాదికి సుమారు రూ.25 లక్షల వరకు ఆదా అవుతుందని అధికారులు వెల్లడించారు.

# జూన్ 2న వనపర్తి రానున్న పట్నం మహేందర్ రెడ్డి



**వనపర్తి. సమయం ప్రతినిధి:** వనపర్తి జిల్లాలో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్న తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.వనపర్తి జిల్లా ఐడిఓసి ఆవరణలో జూన్ 2వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, ప్రగతి నివేదికను తన ప్రసంగం ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించనున్నారు.

# గ్రేటర్‌లో 15 లక్షల రేషన్ కార్డులు.. సేవల్లో మాత్రం తీవ్ర జాప్యం

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పౌరసరఫరాల శాఖ అధికారుల మధ్య సరైన అవగాహన, సమన్వయం కరువవ్వడం ప్రజా పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ప్రాంతంలో సుమారు 15 లక్షలకు పైగా కుటుంబాలకు చెందిన అరకోటి మంది లబ్ధిదారులకు నిత్యావసరాలను సరఫరా చేసే ప్రక్రియలో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చీఫ్ రేషనింగ్ అధికారి కార్యాలయంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పౌరసరఫరాల విభాగాలు ఈ పంపిణీలో భాగస్వాములుగా ఉన్నాయి. సన్న బియ్యం, ఇతర నిత్యావసరాల సరఫరాతో పాటు కొత్త కార్డుల జారీ, తప్పుల సవరణ వంటి కీలక బాధ్యతలను ఈ విభాగాలు నిర్వహిస్తున్నాయి. అయితే అధికారుల మధ్య సయోధ్య లేకపోవడం వల్ల నిత్యావసరాల అక్రమ రవాణాకు దారితీస్తోందనే విమర్శలు వస్తున్నాయి. దీనితో పాటు రేషన్ కార్డుల మంజూరు, ధ్రువీకరణ ప్రక్రియల్లో తీవ్ర ఆలస్యం జరుగుతోంది.కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ ద్వారా వచ్చే దరఖాస్తులను అసిస్టెంట్ సప్లై ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా పౌరసరఫరాల అధికారి ద్వారా సీఆర్వో కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయి పరిశీలనలు సకాలంలో పూర్తికాకపోవడంతో కొత్త కార్డుల పంపిణీ నిలిచిపోయింది. ముఖ్యంగా జిల్లాల సరిహద్దుల్లో ఉండే కాలనీల దరఖాస్తులు ఏ అధికారి పరిధిలోకి వస్తాయనే దానిపై స్పష్టత లేకపోవడంతో విచారణలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. ఒక జిల్లాలో పంపిణీ మొదలైనా, పొరుగు జిల్లా పరిధిలోకి వచ్చే ప్రజలకు తమ కార్డులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారం కోసం ప్రజలు మీసేవ కేంద్రాలు, పౌరసరఫరాల శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.రేషన్ సరుకులు తీసుకోవడానికి కొత్త కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల ప్రజలకు ఇంటి పక్కనే రేషన్ షాపు ఉన్నప్పటికీ, వారి కార్డులు వేరే జిల్లా పరిధిలోకి మారడంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డుల సంఖ్య పెరిగిన చోట కొత్త దుకాణాలను ఏర్పాటు చేయకపోవడంతో ఉన్న రేషన్ షాపులపైనే విపరీతమైన రద్దీ పెరుగుతోంది. దీనికి తోడు ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది.

సరుకుల అక్రమ రవాణాపై ఎవరికి వారు తమ పరిధిలోని అంశం కాదంటూ అధికారులు తప్పించుకుంటున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్లు, గ్రీవెన్స్ సెల్స్ ఉన్నప్పటికీ.. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రేషన్ కార్డులు , లబ్ధిదారుల గణాంక వివరాలను పరిశీలిస్తే.. మొత్తం నాలుగు జిల్లాల వ్యాప్తంగా 15,90,438 రేషన్ కార్డులు ఉండగా, వాటి ద్వారా 58,37,087 మంది లబ్ధిదారులు నిత్యావసర సరుకులను పొందుతున్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 8,41,954 కార్డులు, 32,24,963 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో ఉన్న మేడ్చల్ జిల్లాలో 4,74,855 రేషన్ కార్డులు ఉండగా, లబ్ధిదారుల సంఖ్య 16,45,039 గా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లా పరిధిలో 2,50,036 కార్డుల ద్వారా 8,83,620 మంది లబ్ధి పొందుతుండగా, అత్యల్పంగా సంగారెడ్డి జిల్లాలో 23,593 రేషన్ కార్డులు, 83,465 మంది లబ్ధిదారులు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# పీసీబీలో ఇంటి దొంగలు...

హైదరాబాద్ : రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహిస్తున్న కంప్యూటరైజ్డ్ తనిఖీ విధానంపై తీవ్రమైన అభ్యంతరాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల్లో ఏ నెలలో తనిఖీలు జరుగుతాయనే సమాచారాన్ని ముందే యాజమాన్యాలకు, అధికారులకు చేరవేయడం వల్ల ఉల్లంఘనదారులకు అది అనుకూలంగా మారుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల లోపాలను ముందే సరిదిద్దుకోవడం లేదా అధికారులను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటోందని తెలుస్తోంది.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' రూపొందించిన ఒక ప్రత్యేక టూల్ ద్వారా ఈ కంప్యూటరైజ్డ్ తనిఖీలను పీసీబీ చేపడుతోంది. ఈ విధానంలో ప్రతి నెలా 70 నుండి 120 వరకు పరిశ్రమలలో తనిఖీలు నిర్వహిస్తుండగా, అందులో దాదాపు 30 వరకు రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లోనే ఉంటున్నాయి. ఏ అధికారి ఎక్కడ తనిఖీ చేయాలో పీసీబీ కార్యాలయంలోని ప్రత్యేక విభాగం నిర్ణయిస్తుంది. ఈ తనిఖీల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు. అయితే, ఈ పద్ధతిని పక్కనపెట్టి ఆకస్మిక తనిఖీలు చేసేలా ఒక పటిష్టమైన ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాల తీవ్రతను బట్టి వాటిని రెడ్, ఆరెంజ్, గ్రీన్ కేటగిరీలుగా విభజించి ఈ తనిఖీలు జరపాలి. గతంలో నిబంధనలు పాటించిన రికార్డులను బట్టి తనిఖీలను కేటాయిస్తారు. ఇన్ స్పెక్టర్లకు ఈ బాధ్యతలను రాండమ్‌గా లేదా రిస్క్ ఆధారంగా టూల్ ద్వారా కేటాయించడం జరుగుతుంది. తనిఖీ పూర్తయిన తర్వాత వాటర్, ఎయిర్ యాక్ట్‌ల ప్రకారం 72 గంటల్లోగా ఇన్స్‌పెక్షన్ రిపోర్టును ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వ్యర్థాల శుద్ధి, వాయు కాలుష్య మూలాలు, నియంత్రణ పరికరాలు, ప్రమాదకర వ్యర్థాల ఉత్పత్తి , వాటి నిల్వ, పారవేత వంటి కీలక అంశాలను ఈ నివేదికలో పొందుపరచాల్సి ఉంటుంది.మరోవైపు, ఆన్‌లైన్ ఫిర్యాదుల విభాగమైన 'జనవాణి'కి ప్రజల నుండి ప్రతి నెలా 50కి పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోయడం, చెత్తను దహనం చేయడం, పరిశ్రమల నుండి వెలువడే ఘాటైన వాసనలు వంటి సమస్యలపై పౌరులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా ఆయా పరిశ్రమలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, ఆ నివేదికలను నేరుగా డాష్ బోర్డులో బహిరంగంగా ఉంచితే వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని ప్రజల నుండి డిమాండ్లు వినపిస్తున్నాయి

# మైనారిటీ అభ్యర్థులకు UPSC-CSAT 2027 ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ-సీఎస్ఏటీ 2027 ప్రిలిమ్స్‌కు సిద్ధమయ్యే మైనారిటీ అభ్యర్థుల కోసం 2026-27 విద్యా సంవత్సరానికి ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి తెలిపారు. ఈ కోచింగ్‌లో మొత్తం 100 మంది మైనారిటీ అభ్యర్థులకు (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైన్లు, బౌద్ధులు, పార్సీలు) అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోచింగ్‌లో మహిళలకు 33.33 శాతం సీట్లు, అన్ని కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.యూపీఎస్సీ (సివిల్స్-2027) పరీక్షకు సంబంధించి సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశ పరీక్ష ఆధారంగా ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు cet.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 14-06-2026 అని తెలిపారు. అర్హతలు మరియు ఇతర వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, మహబూబ్‌నగర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7993357089 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ప్రజల భద్రతలో రాజీ లేదు ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలి జిల్లా ఎస్పీ: సునిత రెడ్డి, ఐపీఎస్





**కేసుల దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటించాలి.**
**రాత్రి సమయాలలో అనవసరంగా రోడ్లపై తిరిగే వారినీ కట్టడి చేయండి**
**సైబర్ మోసాలు, బాల్యవివాహాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలి**
**ప్రతి ఒక్క రికార్డును క్రమం తప్పకుండా ప్రతిరోజు నవీకరించాలి.**
**జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేరసమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ**

(సమయం ప్రతినిధి వనపర్తి) : ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు అతిపెద్ద బలం. ప్రతి పోలీసు అధికారి ప్రజలకు చేరువగా ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించాలి. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నివారణ, సైబర్ మోసాల అరికట్టడం, గ్రామ స్థాయిలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి పోలీసు అధికారి బాధ్యతని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, పేర్కొన్నారు. శనివారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని డిఎస్పీలు, సీఐలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి నెలవారి నేరసమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులు తెలుసుకొని చాలా కాలము నుండి పెండింగ్ లో ఉన్నటువంటి కేసులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని, పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్ FSL రిపోర్ట్స్, మెడికల్ సర్టిఫికెట్ త్వరగా తెప్పించి కేసులు ఛేదించాలన్నారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి ఎస్సై తమ పరిధి లోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలి. గ్రామ పోలీసుఅధికారులు తామందుకున్న గ్రామాలపై పూర్తి అవగాహనతో ఉండి, ముందస్తు సమాచార సేకరణపై దృష్టి పెట్టాలి. రౌడీ షీటర్స్, సస్పెక్ట్‌ల కదలికలపై నిఘా ఉంచాలి. బ్లూకోల్ట్స్ నైట్ పెట్రోలింగ్ సిబ్బంది ఫింగర్ ప్రింట్ డివైస్‌లు వినియోగించి అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించాలి.

ఆన్లైన్ సైబర్ మోసాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలి. గుర్తు తెలియని నంబర్ల నుండి వచ్చే వీడియో కాల్స్, డిజిటల్ అరెస్టులు, పోలీస్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ను నమ్మకూడదని ప్రజలకు తెలియజేయాలి. మోసాలకు గురైన వెంటనే, మొదటి గంటలోపే పిర్యాదు చేసేలా అవగాహనా కల్పించాలి, సమాజ భద్రతలో సిసి కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉందని, ప్రతి గ్రామం, వీధి, పరిశ్రమలు, పవిత్ర స్థలాల్లో కమ్యూనిటీ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటికి ఏర్పాటు చేసిన కెమెరాల్లో వీధి దిశకు ఎదురుగా ఉన్నవాటిని కూడా జియో ట్యాగింగ్ చేయించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్సైలకు సూచించారు. 100 డయల్ కాల్స్‌కు త్వరితగతిన స్పందిస్తూ, ప్రజల నమ్మకాన్ని మరింతగా పెంపొందించు కోవాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపడానికి ప్రత్యేక కార్యచరణను అవలంబిస్తూ, ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా లాంటి వాటిని పూర్తిగా రూపుమాపేల కృషి చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలు జరగకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ రాత్రి సమయాలలో అనవసరంగా రోడ్లపై తిరిగే వారినీ కట్టడి చేసి ఫింగర్ ప్రింట్స్ పరికరం ద్వారా తనిఖీలు చేస్తూ దొంగతనాలను జరుగకుండా ఆరికట్టాలని ఎస్పీ గారు అన్నారు. పోలీస్‌స్టేషన్లో ఉండే రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్క రికార్డును కచ్చితంగా క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా రికార్డుల నిర్వహణ చేపట్టాలని ఎస్పీ గారు అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ, రాజేష్ మీనా, ఐపీఎస్. గారు వనపర్తి డిఎస్పీ, గిరిబాబు డిసిఆర్బీ డిఎస్పీ, బాలాజీ నాయక్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి జిల్లాలోని ఎస్సైలు, డిసిఆర్బి, ఐటి కోర్, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్స్, విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు పై ప్రజల సహకరించాలి

**ట్రాఫిక్ అంతరాయం లేని పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: గద్వాల ట్రాఫిక్ సీఐ ఎం.విద్యాసాగర్**




(సమయం ప్రతినిధి గద్వాల) : గద్వాల పట్టణాన్ని ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేని ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దడానికి ప్రజలు, వ్యాపారులు పూర్తి స్థాయిలో సహకరించాలని గద్వాల ట్రాఫిక్ సీఐ ఎం.విద్యాసాగర్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రతపై ఆయన పలు కీలక సూచనలు చేశారు.

**ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి:**

గద్వాల పట్టణంలో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణల వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. గద్వాల మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డుకు ఇరువైపుల అక్రమణలు తొలగించేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు ఉన్న మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం అని, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి మైనర్లకు వాహనాలు ఇస్తే, వారి తల్లిదండ్రులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి:**

గద్వాల పరిసర ప్రాంతాల్లో జరిగే ఇసుక, మట్టి, అక్రమ, పీడిఎస్ బియ్యం అక్రమ రవాణా పైనా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారని, నిబంధనలు మీరి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పట్టణ ప్రజల భద్రత, ప్రయాణ సౌకర్యం దృష్ట్యా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి, సహకరించాలని ట్రాఫిక్ సీఐ ఎం.విద్యాసాగర్ తెలిపారు.

## జూన్ లో సినిమాల మేళ...

హైదరాబాద్ : నిజానికి సమ్మర్ సీజన్ లో సినిమాల సందడి ఎక్కువ ఉండాలి. సమ్మర్ హాలిడేస్ ను ఉపయోగించుకోవడానికి మేకర్స్ ఎప్పుడూ రెడీగా ఉంటారు ఈ క్రమంలోనే ఏప్రిల్, మే , జూన్ నెలల్లో సినిమాలు విడుదల చేయాలని చూస్తుంటారు. కానీ ఈ ఈఏడాది మే సప్పగా సాంగింది. పెద్దగా సినిమాల హడావిడి కనిపించలేదు. విడుదలైన ఒకటి ఎండు సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపలేకపోయాయి. ఇక ఇప్పుడు జూన్ పై అందరి దృష్టి పడింది. జూన్ ను టార్గెట్ చేసుకొని అరడజను సినిమాలు రిలీజ్ కు రెడీ గా ఉన్నాయి. మరి వీటిలో ఏది విజయం సాధిస్తుందో చూడాలి. జూన్ లో విడుదలవుతున్న మొదటి బిగెస్ట్ సినిమా పెద్ది. బుచ్చుబాబు సన దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా పెద్ది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురుచుస్తున్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్ విపరీతమైన హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా భారీ హిట్ అవ్వడం ఖాయం అంటున్నారు ఫాన్స్. అలాగే పెద్ది సినిమా తర్వాత సింగ్ గీతం అనే సినిమా వస్తుంది. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కామెడీ నేపథ్యంలో సాగనుందని తెలుస్తుంది. ఈ సినిమా జూన్ రెండో వారంలో విడుదలకానుంది. ఇక సమంత హీరోయిన్ గా నటిస్తున్న మా ఇంటి బంగారం సినిమా కూడా జూన్ లో విడుదలకానుంది. సమంత భర్త రాజ్ నిడిమోరు క్రియేషన్ లో నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఇంటి బంగారం సినిమా జూన్ మూడో వారంలో విడుదలకానుంది. అలాగే అఖిల్ నటిస్తున్న లెనిన్ సినిమా కూడా జూన్ మూడో వారంలో విడుదలకానుంది. దీవానా, ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు, బాలన్ లాంటి సినిమాలు కూడా విడుదలకానున్నాయి. ఫైనల్ గా తమిళ్ సీఎం దళపతి విజయ్ నటించిన లాస్ట్ మూవీ జననాయగన్ కూడా జూన్ లోనే విడుదలకానుంది. ఈ సినిమాల్లో ఏ సినిమా భారీ హిట్ అవుతుందో చూడాలి.

# క్రమశిక్షణ, నిజాయితీ, విధి నిబద్ధతకు చిరునామాగా నిలిచిన ఎస్సై సుబ్బరాజుకు ఘన వీడ్కోలు పలికిన ఎస్పీ

**కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సై స్థాయికి ఎదిగిన సుబ్బరాజు ప్రయాణం యువ పోలీసులకు స్ఫూర్తిదాయకం**
**పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమే సేవాభావానికి కాదు**
**పదవీ విరమణ ప్రయోజనాలు త్వరితగతిన అందించాలని అధికారులకు ఆదేశాలు**
**37 ఏళ్ల అంకిత సేవలకు వందనం.**



సమయం ప్రతినిధి వనపర్తి : ప్రజాసేవను పరమావధిగా భావిస్తూ, క్రమశిక్షణను జీవిత సూత్రంగా చేసుకుని, 37 సంవత్సరాలపాటు పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించిన జిల్లా పోలీసు కార్యాలయం కంట్రోల్ రూమ్ ఎస్సై శ్రీ సుబ్బరాజు కి జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎస్పీ గారు సుబ్బరాజు గారిని, వారి సతీమణిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేసి వారి విశిష్ట సేవలను కొనియాడారు. విధి ముగిసినా... సేవల స్ఫూర్తి చిరస్థాయిగా నిలుస్తుంది. సుబ్బరాజు గారి సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఉపాధి కాదు... అది సమాజ భద్రత కోసం చేసే త్యాగయాత్ర. అలాంటి యాత్రను 37 సంవత్సరాలపాటు అత్యంత నిజాయితీతో, నిబద్ధతతో కొనసాగించిన అధికారి సుబ్బరాజు గారు" అని పేర్కొన్నారు. 1989లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా సేవలు ప్రారంభించిన సుబ్బరాజు గారు, తన కృషి, పట్టుదల, క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగి సబ్ ఇన్‌స్పెక్టర్ హోదాను అందుకోవడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శమని అన్నారు. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ , గద్వాల్, వనపర్తి తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సైతం ధైర్యసాహసాలతో సేవలందించి, తన సర్వీసు కాలమంతా ఎటువంటి ప్రతికూల వ్యాఖ్యలు లేకుండా విధులు నిర్వర్తించడం ఆయన నిష్కళంక సేవలకు నిదర్శనమని కొనియాడారు. కష్టపడి పనిచేసే వారిని చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. సుబ్బరాజు గారి సేవలు శాఖకు గర్వకారణం. ఆయన చూపిన విధి నిబద్ధత, ప్రజల పట్ల మానవీయ దృక్పథం, సహోద్యోగులతో స్నేహపూర్వక వైఖరి యువతరం పోలీసులకు మార్గదర్శకంగా నిలుస్తాయి" అని ఎస్పీ గారు పేర్కొన్నారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక కొత్త అధ్యాయమని, ఉద్యోగ బాధ్యతల నుంచి విముక్తి పొందిన అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించే జీపీఎఫ్, ఇన్సూరెన్స్, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పదవీ విరమణ అనంతరం అందాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్.,, వనపర్తి డీఎస్పీ, గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ, బాలాజీనాయక్, వనపర్తి సీఐ సుగంధరత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తదితర అధికారులు, సుబ్బరాజు గారి కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



సమయం ప్రతినిధి, పెద్దకొత్తపల్లి: పేద ప్రజల ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో అండగా నిలుస్తోందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండా గ్రామానికి చెందిన కేతావత్ లక్ష్మి భర్త కేతావత్ లాల్యా నాయక్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.33,500 చెక్కును గ్రామ ప్రజాప్రతినిధులు శనివారం అందజేశారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఈ ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్, ఉపసర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. అనారోగ్య సమస్యలతో కొల్లాపూర్ పట్టణంలోని ఆసుపత్రిలో చికిత్స పొందిన లాల్యా నాయక్ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి ఈ సాయం అందినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కేతావత్ భాస్కర్ నాయక్, కోడావత్ సోమ్లా నాయక్, మూడావత్ హర్యా నాయక్, కేతావత్ శంకర్ నాయక్, కేతావత్ సోమాని నాయక్ తదితరులు పాల్గొన్నారు.








# మహిళల భాగస్వామ్యంతో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు

**ప్రతి నియోజకవర్గంలో ఒక మహిళా శక్తి సూపర్ మార్కెట్లు**
**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**






(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ నగరంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పడేలా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో "మహిళా శక్తి సూపర్ మార్కెట్లు " ఏర్పాటు చేసి, మహిళా సంఘాల సభ్యులను భాగ స్వాములుగా, షేర్‌హోల్డర్లుగా చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ సూపర్ మార్కెట్లను మహిళలే నిర్వహిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మహిళలకు ఉపాధి, గౌరవం కలుగుతుందని ఆయన చెప్పారు. మహిళలను భాగ స్వాములుగా చేస్తే ఈ వ్యవస్థ భవిష్యత్తులో పెద్ద కార్పొరేట్ సంస్థగా ఎదగ గలదని ఎమ్మెల్యే సూచించగా, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, వెంటనే విధివిధానాల రూప కల్పనకు అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడిం చారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా, నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తక్కువ లీజుతో ప్రభుత్వ స్థలాలు ఇవ్వడం, రిటైల్ రంగంలో శిక్షణ అందించడం ద్వారా మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కృతజ్ఞత సభలో వేలమంది మహిళలు పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో రైస్ మిల్లులు, ఇతర పారిశ్రామిక యూనిట్ల నిర్వహణలో కూడా మహిళలకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలుస్తాం మంత్రి శ్రీహరి



(సమయం ప్రతినిధి హైదరాబాద్): పేదల వైద్య ఖర్చులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్:మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేదల వైద్య ఖర్చులకు అండగా నిలుస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. వనపర్తి జిల్లా మక్తల్ నియోజకవర్గం ఆత్మకూర్ మండలం అరేపల్లి గ్రామానికి చెందిన శ్రీమతి ఎస్. శాంతమ్మ గారు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల రూపాయల CMRF-LOC ప్రపోజల్స్‌ను మంత్రి వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఎవరూ వైద్య ఖర్చుల కారణంగా ఆస్పత్రి పాలవ్వకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## చంద్రబండ తండాకు ప్రీ-ప్రైమరీ స్కూల్ మంజూరు



సమయం ప్రతినిధి, పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండా గ్రామానికి ప్రీ-ప్రైమరీ పాఠశాల మంజూరైనట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న నూతన విద్యా విధానంలో భాగంగా, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి ఫలితంగా ఈ పాఠశాల మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్, ఉపసర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్, గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రాంతంలో గ్రామస్తులతో సమావేశమై పాఠశాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలంలోని కొన్ని గ్రామాలకు మాత్రమే ప్రీ--ప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యాయని, అందులో చంద్రబండ తండా ఎంపిక కావడం గ్రామ ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి విద్యాభ్యాసం చేయించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేల రూపాయలు ఖర్చు చేసి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రీ-ప్రైమరీ పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో పాటు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్య అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు, ఒక ఆయా పోస్టు భర్తీ కానున్నట్లు వెల్లడించారు. అలాగే విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మేట్ కేతావత్ భాస్కర్ నాయక్, గ్రామ నాయకులు కేతావత్ గేమ్యా నాయక్, కోడావత్ రాంలాల్ నాయక్, కేతావత్ రామశీల నాయక్, కేతావత్ గోపాల్ నాయక్, మూడావత్ హర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు పూర్తి చేయండి

**విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత**
**గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యం**
**పాఠశాలల పునఃప్రారంభం నాటికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ ప్రతినిధి : పాఠశాలల పునఃప్రారంభం నాటికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల నిర్మాణ పనులను పూర్తిచేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలోని పోల్కంపల్లి, వంగూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల పనులను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవన నిర్మాణం, తరగతి గదులు, లైబ్రరీ, ఆటస్థలాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థల్లో ప్రతి నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ సామగ్రి నాణ్యత, భవనాల భద్రతా ప్రమాణాలు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదుల రూపకల్పన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా అత్యాధునిక విద్యా వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు.



పాఠశాలల పునఃప్రారంభ సమయానికి నిర్మాణ పనులు పూర్తికాకపోతే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్న కలెక్టర్, మిగిలిన పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రారంభం నాటికి అన్ని తరగతి గదులు, లైబ్రరీ, ఆటస్థలాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. నిర్మాణ పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం నిర్మాణ ప్రదేశంలో పనిచేస్తున్న అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలను విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రమేష్ కుమార్, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతో వివక్ష లేని సమాజ నిర్మాణం





**సమయం ప్రతినిధి:** ప్రస్తుతం మహిళలు అనేక రంగాల్లో రాణి స్తున్నారని, మహిళా సాధికారతతో వివక్ష లేని సమాజ నిర్మా ణం జరుగుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ వారోత్సవాల్లో శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని స్నేహ సంఘాల సభ్యులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యూనిసెఫ్ సహకారంతో బాలికల సర్వతోముఖాభివృద్ధికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్నేహ సంఘాలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. బాలికలు ప్రజా స్వామ్య వ్యవస్థ, నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల ప్రతి పాదన, ప్రశ్నించడం, తదితర విషయాలపై అవగాహన పెంపొందించుకునేందుకు మాక్ పార్లమెంట్ దోహదపడుతుం దన్నారు. స్నేహ సంఘాల ద్వారా అమ్మాయిలు తమ గ్రామా ల్లోని బాల్య వివాహాలు, నిరక్షరాస్యత వంటి సామాజిక సమస్య లను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాలికలు మాక్ పార్లమెంట్ ద్వారా జిల్లాలోని వివిధ సామాజిక సమస్యలను ప్రస్తావించారు. పలు పాఠ శాలల్లో మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్నచోట పరిశుభ్రంగా లేకపోవడం, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల ఆవశ్యకత, రవాణా సౌకర్యాల కొరత, తదితర సమస్యలను బాలికలు తెలియజేయగా సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం బాలికలు ఐడిఓసిలో ఉన్న పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించి అక్కడి పనితీరును గురించి సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికలకు హిమో గ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూని సెఫ్ రాష్ట్ర సమన్వయకర్త మురళి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, డిడబ్ల్యుఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి పాల్గొన్నారు.

# రేవంత్ దిమ్మతిరిగే రాజకీయ వ్యూహం...

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు రేవంత్ రెడ్డి సాహసం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. ప్రాంతీయ విభేదాల కుంపట్ల మధ్య, సీమాంధ్ర పాలకులపైన, ఆంధ్రా మూలాలపైన ఒక వర్గం విపరీతమైన ద్వేషాన్ని నూరిపోస్తున్న వేళ.. హైదరాబాద్ నడిబొడ్డున, అమీర్‌పేట చౌరస్తాలో తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు నందమూరి తారకరామారావు విగ్రహం కొలువుదీరింది. రేవంత్ రెడ్డి విమర్శల తుపానులను లెక్కచేయకుండా, స్వపక్షంలోని సొంత గొంతుల అభ్యంతరాలను తొక్కుకుంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించి తనేంటో, తన దమ్ము ఏంటో మరోసారి నిరూపించుకున్నారు. ఇది కేవలం ఒక విగ్రహావిష్కరణ కాదు.. తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే రేవంత్ మార్క్ రాజకీయ చాణక్యం.కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఉంటూ, ఒకప్పటి ప్రత్యర్థి పార్టీ తెలుగుదేశం వ్యవస్థాపకుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం అంటే సామాన్యమైన విషయం కాదు. దీనిపై రాజకీయంగా ఎన్నో విమర్శలు, మరెన్నో అపోహలు సృష్టించే ప్రయత్నం జరిగింది. కానీ, రేవంత్ రెడ్డి వాటన్నింటినీ తనదైన శైలిలో తిప్పికొట్టారు. ఎన్టీఆర్‌ను ఏ ఒక్క ప్రాంతానికో, కులానికో పరిమితం చేయడం అజ్ఞానమే అవుతుందని చాటిచెప్పారు.సమాజంలో అణగారిన వర్గాల కోసం పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన ఇందిరా గాంధీ సరసన ఎన్టీఆర్‌ను నిలబెట్టి.. ఆయన నిరుపేదల పక్షపాతి అని నినదించారు. అన్నగారు తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అని, ఆయన్ను ప్రాంతీయ సంకెళ్లతో బంధించలేమని రేవంత్ రెడ్డి భావోద్వేగంగా ప్రకటించిన తీరు.. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరి గుండెలను తాకింది. ఈ వేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై, ముఖ్యంగా కేసీఆర్‌పై సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎన్టీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతో, ఆయన కాళ్ల చెంత రాజకీయ ఒనమాలు నేర్చుకుని, ఈ రోజు ఆ స్థాయికి చేరిన కేసీఆర్ వంటి నాయకులు.. ఇప్పుడు అదే ఎన్టీఆర్‌ను, ఆయన వారసత్వాన్ని విమర్శించడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎదిగిన కొద్దీ ఒదగాల్సింది పోయి, రాజకీయ జన్మనిచ్చిన నాయకుడినే విస్మరించడం, విమర్శించడం ద్రోహమే అవుతుందన్నారు. తెలంగాణ సమాజంలో కృతజ్ఞతకు, ద్రోహానికి మధ్య ఉన్న తేడాను కళ్లకు కట్టింది. అధికార దాహంతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేసిన వారికి ఈ విగ్రహావిష్కరణ ఒక గట్టి చెంపపెట్టుగా నిలిచింది. ఈ విగ్రహావిష్కరణ వెనుక రేవంత్ రెడ్డి కేవలం భావోద్వేగాన్నే నమ్ముకోలేదు.. అత్యంత పదునైన, వ్యూహాత్మక రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శించారు. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఉన్న లక్షలాది మంది తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను, నందమూరి అభిమానులను కాంగ్రెస్ వైపు తిప్పుకునేలా ఈ సందర్భాన్ని ఆయన మలుచుకున్నారుప్రాంతీయ విభేదాలను పక్కనబెట్టి, తెలుగు వారందరినీ ఒకే తాటిపైకి తెచ్చే మహా నాయకుడిగా తనను తాను ఆవిష్కరించుకున్నారు. అటు సీమాంధ్ర ఓటర్లలో నమ్మకాన్ని పెంచుతూనే, ఇటు తెలంగాణ ఆత్మగౌరవానికి తానే నిజమైన వారసుడినని నిరూపించుకున్నారు. వ్యూహాత్మకంగా ప్రత్యర్థుల నోళ్లు మూయించడంలో రేవంత్ రెడ్డి ఎంతటి సమర్థుడో ఈ ఘటనే సాక్ష్యంసవాళ్లకు ఎదురువెళ్లడం రేవంత్ రెడ్డి నైజం. విమర్శలు వస్తాయని తెలిసి కూడా, అమీర్‌పేట సాక్షిగా అన్నగారి విగ్రహాన్ని నిలబెట్టి, తెలుగుజాతి గుండెల్లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. భావోద్వేగాలను రగిలిస్తూనే.. లౌక్యంతో, ధైర్యంతో రేవంత్ రెడ్డి వేసిన ఈ అడుగు తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది దమ్మున్న నాయకుడి.. దిమ్మతిరిగే రాజకీయ వ్యూహం

## ప్రాంతీయ పార్టీల్లో ఆంధ్రానే టాప్
## ఆదాయంలో టీడీపీ ఖర్చులో వైసీపీ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలకు సంబంధించి ఆదాయాల లెక్కలు ఆసక్తికరంగా మారాయి. 36 ప్రాంతీయ పార్టీలకు సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం.. గత ఆర్థిక సంవత్సరం 2023-2024తో పోలిస్తే 51.57 శాతం తగ్గింది. ఆసక్తికరంగా 21 పార్టీలు ఆదాయం కంటే ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ రిపోర్ట్ ద్వారా ఆసక్తికర విషయాలు తెలిశాయి. 2024-25కు సంబంధించి 67 గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు ఉంటే.. వాటిలో 36 పార్టీలకు సంబంధించి ఆడిట్ వివరాలు వెల్లడించారు. 2024-2025లో 36 ప్రాంతీయ పార్టీలకు రూ.1,192 కోట్ల ఆదాయం రాగా.. వీటిలో రూ.1,433 కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రాంతీ పార్టీలు వచ్చిన ఆదాయం కంటే రూ.241 కోట్లు (20.13%) ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. టీడీపీకి 2024-2025లో రూ.228.31 కోట్ల ఆదాయం వచ్చింది. వీటిలో రూ.120 కోట్లు రుసుము, చందాల రూపంలో వచ్చాయి.. విరాళాలుగా రై.85.20 కోట్లు.. బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రూ.23.02 కోట్లు.. అలాగే మరో రూ.0.05 కోట్లు వచ్చినట్లు తెలిపారు. రెండో స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ రూ.219.35 కోట్లతో ఉంది, మూడో స్థానంలో వైసీపీ రూ.140.38కోట్లు, బీఆర్ఎస్ రూ.123.67 కోట్లు, బీజేడీ రూ.110.13 కోట్లు, ఏఐడీఎంకే రూ.86 కోట్లు, జనసేన రూ.64 కోట్లు ఆదాయం వచ్చింది. వైఎస్సార్‌సీపీకి రూ.140.05 కోట్లు విరాళాల రూపంలో, ఐటీ రీఫండ్ రూ.18 లక్షలు, డిపాజిట్లపై వడ్డీగా రూ.14 లక్షలు.. ఇతర మార్గాల్లో రూ.27వేలు వచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లపై వడ్డీగా రూ.107.96 కోట్లు, చందాలు- రూ.15.09 కోట్లు, ఐటీ రిఫండ్‌పై వడ్డీగా రూ.13 లక్షలు, ఇతర మార్గాల్లో రూ.48 లక్షల ఆదాయం వచ్చింది. జనసేన పార్టీకి మొత్తం రూ.64 కోట్లలో సభ్యత్వ రుసుం కింద రూ.59.62 కోట్లు, డిపాజిట్లపై వడ్డీ కింద రూ.4.48 కోట్లు వచ్చాయి. 2023-24లో 36 పార్టీలకు రూ.2,463.17 కోట్ల ఆదాయం వస్తే.. 2024-25లో రూ.1,192.94 కోట్లకు తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి. బీఆర్ఎస్‌కు ఆదాయం రూ.561 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్-రూ.427 కోట్లు, బీజేడీ- రూ.187 కోట్లు, ఆర్‌జేడీ- రూ.72 కోట్లు, టీడీపీకి-రూ.56 కోట్లు, వైఎస్సార్‌సీపీకి-రూ.50 కోట్ల మేర తగ్గింది. ఆసక్తికరంగా అన్నా డీఎంకేకు ఆదాయం రూ.39 కోట్లు, ఎంఎన్ఎస్-రూ.37 కోట్లు, జనసేన- రూ.24 కోట్లు, జేఎంఎం-రూ.21 కోట్లు, జేడీయూ- రూ.16 కోట్లు, సీపీఐ ఆదాయం రూ.10 కోట్ల మేర పెరిగింది. వైఎస్సార్‌సీపీ 2024-2025లో వైఎస్సార్‌సీపీ రూ.340 కోట్లు, బీజేడీ రూ.288 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ రూ.227 కోట్లు, బీఆర్ఎస్ రూ.180 కోట్లు, సమాజ్‌వాదీ రూ.74 కోట్లు, టీడీపీ రూ.61.33 కోట్లు, జనసేన పార్టీ రూ.56.94 కోట్లు ఖర్చు చేశాయి. ఓవరాల్‌గా ప్రాంతీయ పార్టీల్లో ఆదాయంలో టీడీపీ రూ.228 కోట్లు, ఖర్చులో వైఎస్సార్‌సీపీ రూ.340 కోట్లు తొలి స్థానాల్లో నిలిచాయి.

## ఢిల్లీకి చేరిన తెలంగాణ పంచాయితీ

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికలలో కేవలం కేరళ రాష్ట్రంలో మాత్రమే అధికారంలోకి వచ్చింది. తమిళనాడు రాష్ట్రం లో అధికార పక్షంలో ఒక భాగమైంది. కీలకమైన పశ్చిమ బెంగాల్లో.. అస్సాంలో.. చిన్న రాష్ట్రమైన పుదుచ్చేరిలో అధికారాన్ని దక్కించుకోలేక పోయింది. కనీసం చెప్పుకునే స్థాయిలో శాసనసభ స్థానాలను దక్కించుకోలేకపోయింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇప్పుడు వచ్చే వాళ్ళతో.. పోయే వాళ్లతో అత్యంత రద్దీగా ఉంది. రాహుల్ గాంధీ కూడా మల్లికార్జున కార్గే.. వేణుగోపాల్ రెడ్డి వంటి వారితో నిత్యం సమావేశాలు పెడుతున్నారు. ఏం జరిగి ఉంటుంది.. ఏం జరుగుతోంది అనే ప్రశ్నలు వ్యక్తమవు తున్నప్పుడే.. తెలంగాణ నేతలు అక్కడ కనిపిస్తున్నారు. కొద్దిరోజుల వరకు సాగిన కర్ణాటక పంచాయతీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడంతో ముగిసింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ పంచాయతీ ప్రారం భమైంది. అలాగని తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు జరగడం లేదు. రేవంత్ రెడ్డి స్థానంలో కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుకోవడం లేదు. కాకపోతే కొంతమంది మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు.. తమ శాఖలలో పిచ్చిపిచ్చి పనులు చేస్తున్నట్టు అధిష్టానానికి నివేదిక అందింది. ఇటీవల మీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీకి ఈ విషయాన్ని చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో అధిష్టానం కొన్ని శాఖలలో ప్రక్షాళన చేయాలని భావించినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకుడు వెంటనే ఢిల్లీ చేరుకున్నారు. మంత్రులుగా ప్రమోషన్ సాధించాలి అనుకునేవారు రాహుల్ గాంధీ ప్రాపకం కోసం పాకులాడుతున్నారు. వారిలో ఇప్పటికే గడ్డం ప్రసాద్ తనకు మంత్రి పదవి కేటాయించాలని రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించిన తెలుస్తోంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వంటి వారు తమకు మంత్రి పదవులు ఇవ్వాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసినట్టు తెలుస్తోంది. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరినట్లు తెలుస్తోంది. కొంతకాలంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. ముఖ్యమంత్రిపై నేరుగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా మాట్లాడుతున్నారు. మంత్రివర్గ ప్రక్షాళన జరుగుతుందని వార్తలు వస్తున్నా నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీ నివాసంలో గాని.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాని కనిపించడం లేదు. ఇంతవరకు విజ్ఞప్తులు అందించినట్టు కూడా సమాచారం అందడం లేదు. అంటే మంత్రివర్గ విస్తరణ ఉంటుందా.. లేక మీడియాకు కాంగ్రెస్ పార్టీ లీకలు ఇస్తోందా.. అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై మరింత స్పష్టత రావాలంటే మరికొంత సమయం పడుతుందని పొలిటికల్ ఎక్స్పర్ట్స్ అంటున్నారు.

**మంత్రుల మూగనోము..** తెలంగాణ కాంగ్రెస్ మంత్రుల్లో సఖ్యత లేదు. ఎవరి పని వారే చేసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీలు చేసే విమర్శలకు సయితం కనీసం మంత్రులు స్పందించడం లేదు.

# జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి



**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, సమయం ప్రతినిధి:** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు, అధికారులకు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు, అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు వేదిక ఏర్పాట్లు సహా హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పోలీసు గౌరవ వందనంతో పాటు, బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, సిపిఓ హరికృష్ణ, ఆర్డీవో సుబ్రహ్మణ్యం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మెట్‌గాలాలో భారతీయం

**ఏటా న్యూయార్క్‌లో జరిగే 'మెట్ గాలా'లో ఈసారి భారతీయ వారసత్వం ధగధగలాడింది. ప్రముఖ పారిశ్రామికవేత్త మేఘా కృష్ణారెడ్డి సతీమణి సుధారెడ్డి, రిలయన్స్ ఇండస్ట్రీస్ వారసురాలు ఇషా అంబానీ, జైపూర్ రాజవంశీకురాలు రాకుమారి గౌరవి కుమారి అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. వీరితోపాటు లారెన్ వాసర్, ఆరియానా ఫిలిప్ అనే ఇద్దరు విభిన్నమైన వనితలు తమ ప్రత్యేకతను చాటుకున్నారు.**

సమయం ప్రతినిధి

ఈ మెగా షోలో ప్రధాన ఆకర్షణ ప్రముఖ పారిశ్రామికవేత్త మేఘా కృష్ణారెడ్డి సతీమణి మేఘా సుధారెడ్డి. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా 'ట్రీ ఆఫ్ లైఫ్' థీమ్‌తో ప్రత్యేకంగా రూపొందించిన డ్రెస్‌లో అబ్బురపరిచారు. ఈ లుక్‌కు మరింత వన్నె తెచ్చేలా ఖరీదైన కంఠాభరణంలో మెరిసిపోయారు. దీని విలువ సుమారు రూ.142 కోట్లు ఉంటుందని అంచనా. త్రికోణాకారపు రోజ్‌కట్ డైమండ్స్‌తో ప్రముఖ స్టైలిస్ట్ మారియల్ హెనిన్ దీన్ని రూపొందించారు. హారం లాకెట్‌లో ఖరీదైన 550 కేరెట్ల ముదురు ఊదా నీలం రంగు టాంజానియా వజ్రాన్ని పొదిగారు. మెరిలానీ క్వీన్'గా పిలిచే ఆకర్షణీయమైన ఈ లాకెట్ టాంజానియాలోని మెరిలానీ ప్రాంతానికి చెందినదిగా చెబుతారు. దానికి జతగా చేతి వేళ్లకు 30 క్యారెట్ల పోల్కీ డైమండ్ రింగ్, 40 క్యారెట్ల యాషర్ కట్ కొలంబియన్ పచ్చను ధరించారు. ఆమె ధరించిన డ్రెస్‌ను మచిలీపట్టణం కలంకారీ శైలిలో సహజ రంగులు అద్ది, చేతితో నేశారు. మన నేల సంస్కృతిని ప్రతిబింబించేలా పాలపిట్ట, జమ్మిచెట్టు, తంగేడు పువ్వు, సూర్య, చంద్ర ఆకృతులు అందులో పొందుపరిచారు. దీని తయారీకి 90 మంది హస్తకళాకారులు 3,400 గంటలకు పైగా శ్రమించారు. 'వీటన్నిటి వెనుకా ఉన్న మానవ స్పర్శే నన్ను కదిలిస్తుంది. వేలాది గంటలు, లెక్కలేనన్ని చేతులు, తరతరాల జ్ఞానం అల్లుకుని ఈ ఒకేఒక్క క్షణాన్ని తీర్చిదిద్దుకున్నాయి' అంటూ ఈ ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో సుధారెడ్డి పోస్ట్ చేశారు. ఇంకా... హైదరాబాద్ కేవలం తన జన్మస్థలం మాత్రమే కాదని, అది ఒక భాష, ఒక లయ, ఒక ప్రయాణం అని రాసుకొచ్చారు.

## ఇషా.. 400 ఏళ్లనాటి చరిత్ర

ఇషా అంబానీ ధరించిన గోల్డెన్ టిష్యూ సిల్క్ శారీని ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించారు. అయితే, అందరి కళ్లు ఆమె ధరించిన బ్లౌజ్‌పైనే నిలిచాయి. ఎందుకంటే అది అరుదైన వజ్రాల సమాహారం. దాదాపు 1,800 క్యారెట్ల వజ్రాలను ఈ బ్లౌజ్ కోసం ఉపయోగించారు. మరీ ముఖ్యంగా, హైదరాబాద్ నిజాంలు తమ తలపాగాకు ధరించే 'సర్పేచ్' అనే చారిత్రక ఆభరణాన్ని ఈ బ్లౌజ్ వెనుక భాగంలో బ్రూచ్‌గా అమర్చారు. నీతా అంబానీ వ్యక్తిగత సేకరణ నుంచి తీసుకున్న ఈ ఆభరణం పచ్చలు, వజ్రాలు, కుందన్ పనితనంతో మెరిసిపోతూ భారతీయ కళావైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

ఈ వేడుకలో ఇషా ధరించిన మరో అరుదైన వస్తువు మొఘల్ చక్రవర్తి షాజహాన్‌కు చెందిన బ్రేస్‌లెట్. 17వ శతాబ్దానికి చెందిన ఈ ఆభరణంలో వజ్రాలు, కెంపులు, స్పినెల్స్ పొదిగి ఉన్నాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పురాతన బ్రేస్‌లెట్ విలువ రూ. 200 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఒక చక్రవర్తి వాడిన ఆభరణాన్ని ఆధునిక ఫ్యాషన్‌కు జోడించి ఇషా అంబానీ అందరినీ ఆశ్చర్యపరిచారు. దీనిని సుమారు 50 మంది కళాకారులు 1,200 గంటలపాటు శ్రమించి రూపొందించారు. 1953లో బరోడా మహారాణి సీతాదేవి తన కాలి పట్టీలలోని పచ్చలు, వజ్రాలను అమెరికన్ వ్యాపారి హ్యారీ విన్‌స్టన్‌కు విక్రయించగా, ఆయన వాటితో ఒక అద్భుతమైన నెకట్లేసను తయారుచేశారు. ఆ చారిత్రక హారాన్ని అంబానీ కుటుంబం సొంతం చేసుకుని ఈ వేడుక కోసం తిరిగి వినియోగించడం విశేషం.

## అమ్మమ్మ చీరలో రాకుమారి

జైపూర్ రాజవంశీకురాలు రాకుమారి గౌరవి కుమారి ఈ వేడుకలో తన అరంగేట్రంతో అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆధునిక డిజైన్లపై మోజుతో కాకుండా.. తన కుటుంబ మూలాలను, గతాన్ని గౌరవిస్తూ ఆమె ఎంచుకున్న ఆహార్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. గౌరవి ధరించిన దుస్తులు ఒక కథను చెప్పాయి. ప్రపంచంలోనే అత్యంత అందగత్తెగా గుర్తింపు పొందిన తన అమ్మమ్మ, దివంగత జైపూర్ మహారాణి గాయత్రీదేవికి చెందిన అసలైన పింక్ షిఫాన్ చీరను ఆమె ఎంచుకున్నారు. ఆ వింటేజ్ చీరను ప్రఖ్యాత డిజైనర్ ప్రబల్ గురుంగ్ ఒక స్టైలిష్ గౌనుగా మలిచారు.

## విభిన్న మోడళ్లు

పుట్టుకతోనే వెంటతెచ్చుకున్న వైకల్యానికి కొంతమేరకు సర్దుకుపోవచ్చు. కానీ కెరీర్‌ను మలుచుకునే కీలకమైన వయసులో ఊహించని పరిణామంతో అంగవైకల్యం ప్రాప్తిస్తే, ఆ వేదనను, బాధను అధిగమించడం చాలా కష్టం. దురదృష్టవశాత్తూ, లారెన్ వాసర్‌కు అదే దుస్థితి ఎదురైంది. 24 ఏళ్ల వయసులో ఈ మోడల్, యాక్టివిస్ట్... టాక్సిక్ షాక్ సిండ్రోమ్‌కు గురైంది. టాంపన్ వాడకంతో ముడిపడి ఉండే ఈ సమస్య లారెన్ విషయంలో అవయవ విచ్ఛేదానికి దారి తీసింది. 2012లో ఎడమ కాలునూ, 2018లో కుడికాలునూ కోల్పోయిన లారెన్, అర్ధాంతరంగా అంగవైకల్యం బారిన పడింది. దాంతో ఆమె మోడలింగ్ కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. ఎనిమిది నెలల పాటు వీల్‌చైర్‌కే పరిమితమైన సమయంలో, తన భావోద్వేగాలను ఏమాత్రం దాచుకోలేకపోయిందామె. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోవడంతో, తాను తీవ్రంగా కుంగిపోయాననీ, బాత్రూంలో ఏడుస్తూ ఉండిపోయేదాన్ననీ ఒక సందర్భంలో బహిరంగంగా చెప్పుకుంది. ఇక మీదట మోడలింగ్ పరిశ్రమ తననెప్పటికీ ఆదరించదని అనుకున్నానని కూడా చెప్పుకుంది. నిజానికి అదే నిజాయితీ ఆమె కెరీర్‌కు దన్నుగా మారింది.

## బంగారం కాళ్ల అమ్మాయిగా...

కాలం ఎంతటి గాయాన్నైనా మాన్పుతుందని అంటారు. అదే విధంగా లారెన్ కాలి గాయాలు, మానసిక గాయాలూ మానిపోయాయి. గాయాల నుంచి కోలుకోగానే, బంగారంతో తయారైన కృత్రిమ కాళ్లను ధరించడం మొదలుపెట్టిందామె. అంతే కాకుండా టాక్సిక్ షాక్ సిండ్రోమ్ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం, కృత్రిమ కాళ్లనే ఫ్యాషన్ భాషగా మార్చుకుని, ఫ్యాషన్ షోలలో ప్రదర్శించడం మొదలుపెట్టింది. అప్పటి నుంచి ఆమెకు 'ది గర్ల్ విత్ గోల్డెన్ లెగ్స్' అనే పేరొచ్చింది. తాజా మెట్‌గాలాలో సైతం బంగారంలా మెరిసేపోయే దుస్తులతో, బంగారంతో తయారైన కృత్రిమ కాళ్లతో పవర్‌ఫుల్ ఫ్యాషన్ ఫిగర్‌గా తన ఉనికిని చాటుకుంది.

## ఆరియానా రోజ్ ఫిలిప్

ఆరియానా, 2001, మార్చి 11న ఆంటిగ్వాలో క్వాడ్రాప్లెజిక్ సెరిబ్రల్ పాల్సీతో పుట్టింది. మూడేళ్ల వయసులో ఆమెతో పాటు ఆమె కుటుంబం అమెరికాకు వలస వెళ్లిపోయి, న్యూయార్క్‌లో స్థిరపడింది. తనంతట తాను ఏ పనీ చేసుకోలేని ఆరియానా, తన వైకల్యానికి కుంగిపోకపోగా, 14 ఏళ్ల వయసు నుంచే బ్లాగులు రాయడం మొదలుపెట్టి, తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించింది. 2016లో, 14 ఏళ్ల వయసులో ఆరియానా రాసిన 'దిస్ కిడ్ కెన్ ఫ్లై: ఇట్స్ ఎబౌట్ అబిలిటీ(నాట్ డిసబిలిటీ) మెమొయిర్‌తో రచయితగా గుర్తింపు పొందింది. ఈ పుస్తకం ద్వారా, క్వాడ్రాప్లెజిక్ సెరిబ్రల్ పాల్సీతో బాల్యంలో తానెదుర్కొన్న అనుభవాలను వివరించింది ఆరియానా. ఆ తర్వాత ఎడిటోరియల్ ఫీచర్స్‌తో ఫ్యాషన్ ప్రపంచంలోకి ప్రవేశించి, తన మోడలింగ్ కెరీర్‌ను మలుచుకుంది. 2018లో మొట్టమొదటి నల్ల జాతి ట్రాన్స్‌జెండర్, దివ్యాంగ మోడల్‌గా ఒక ప్రముఖ మోడలింగ్ ఏజెన్సీకి ప్రాతినిధ్యం వహించింది. అప్పటి నుంచి ప్రముఖ ఫ్యాషన్ ఫొటో షూట్స్, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ తనదైన ప్రత్యేక గుర్తింపు సాధించింది. 2022, మోషినోస్ స్ప్రింగ్/సమ్మర్ షోలో ప్రధాన లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ వాక్ కోసం, వీల్‌చైర్ వాడుకున్న మొట్టమొదటి మోడల్‌గా కూడా గుర్తింపు పొందింది. తాజా మెట్ గాలాలో సైతం వీల్‌చైర్‌లో మెరిసిన మొట్టమొదటి రన్‌వే మోడల్‌గా పేరు పొందింది.

'గళమెత్తిన దివ్యాంగులను కార్యకర్తలుగా ముద్ర వేయడం పరిపాటిగా మారిపోయింది. మా శరీరాల్లో వైకల్యాలూ, మాకు కల్పించవలసిన వసతుల గురించి ఎవరికీ ఎటువంటి అవగాహనా ఉండదు. ఇలాంటి సామాజిక వ్యవస్థను సవాలు చేస్తూ ఉంటాం కాబట్టి మాకు కార్యకర్తలనే బిరుదులిస్తూ ఉంటారు. ఎన్నో ఏళ్లుగా దివ్యాంగులకు ఎక్కడా, ఏ వేదిక మీదా ప్రాతినిధ్యం ఉండేది కాదు. మెట్ గాలా లాంటి ఇలాంటి కార్యక్రమాల్లో తాము కూడా పాల్గొనగలుగుతామనే ఆలోచనే దివ్యాంగులకు ఉండేది కాదు. ఆ స్థితి నుంచి ఎదిగి, మెట్ గాలాలో హాజరయ్యే స్థాయికి చేరుకోగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది' అంటూ మెట్‌గాలా వేదికగా తన ఆనందాన్ని పంచుకుంది.

---



# ప్రజాక్షేత్రంలో మహిళా వికాసం

**ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు మహిళా అభ్యర్థులు ప్రత్యేకతను చాటుకున్నారు. విభిన్న వర్గాలు... భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన వీరు... ప్రత్యర్థులను వెనక్కు నెట్టి విజేతలుగా నిలిచారు. రాజకీయాల్లో తమదైన ముద్ర వేసేందుకు... ప్రజల పక్షాన చట్ట సభల్లో తమ వాణి వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. వారే వీరు...**

సమయం ప్రతినిధి

## తొలి అడుగులోనే చరిత్ర

"ఒక మహిళగా జీవించాలంటే ఎంతో శ్రమ పడాలి. హిజాబ్ ధరించి జీవించడానికి మరింత కష్టపడాలి. ఒక మహిళగా, ముస్లిం మహిళగా, హిజాబ్ ధరించే ముస్లిం మహిళగా... ఇక్కడికి చేరుకోవడానికి ఇప్పటికే ఎన్నో అవరోధాల్ని అధిగమించాను..."ఇటీవలి కేరళ ఎన్నికల ప్రచారం సందర్భంలో ఫాతిమా తహిలియా చెప్పిన మాటలివి. ఆ తరువాత... తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన ఆమె... అసెంబ్లీలో అడుగు పెట్టడానికి ఆఖరి అవరోధాన్ని కూడా దాటేశారు. 78 ఏళ్ళ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) తరఫున చట్టసభలకు ఎన్నికైన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు.

## ఎన్నెన్నో వివాదాలు...

కోళికోడ్‌లోని పెరంబ్రా నియోజకవర్గం అభ్యర్థిగా ఫాతిమా పేరును (ఐయూఎంఎల్) ప్రకటించినప్పటి నుంచి ఎన్నో వివాదాలకు ఆమె కేంద్రబిందువయ్యారు. సైబర్ దాడులను, ఆన్‌లైన్ వేధింపులను, దూషణలను ఆమె ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో అశ్లీలమైన వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. హిజాబ్ ధరించిన మహిళగా ఆమె పాలనా సామర్థ్యంపై అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. ఒక వైపు ప్రచారంలో తీరికలేని ఫాతిమా... వీటన్నిటినీ తట్టుకోడానికి చాలా శ్రమపడాల్సి వచ్చింది. అయితే మహిళల నుంచి, యువత నుంచి ఆమెకు అద్భుతమైన మద్దతు లభించింది.

## వేధింపులపై గొంతు విప్పి...

కోళికోడ్‌లోని పెరువయల్‌లో పుట్టిన ఫాతిమా కాలికట్ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదివారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లో ప్రవేశించిన ఆమె 'ముస్లిం స్టూడెంట్స్ ఫెడరేషన్' (ఎంఎ?సఎఫ్) క్రియాశీలకంగా పని చేశారు. దానికి జాతీయ ఉపాధ్యక్షురాలుగా నియమితురాలయ్యారు. 'ముస్లిం యూత్ లీగ్' రాష్ట్ర కార్యదర్శిగానూ వ్యవహరించారు. కాగా... ఐయుఎంఎల్‌లో 2021లో లైంగిక వేధింపులకు గురయ్యామంటూ గొంతు విప్పిన మహిళల్లో ఫాతిమా ఒకరు. ఈ వివాదం నేపథ్యంలో ఎంఎ?సఎఫ్ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి పార్టీ ఆమెను తొలగించింది. కొన్ని రోజుల తరువాత... ఆమె తొలి అధ్యక్షురాలిగా, ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఎంఎ?సఎఫ్ మహిళా విభాగం 'హరిత' రాష్ట్ర కమిటీని కూడా ఐయుఎంఎల్ రద్దు చేసింది. దీంతో పార్టీకి ఫాతిమా పూర్తిగా దూరమైనట్టేనని పరిశీలకులు భావించారు. కానీ ఆమె తిరిగి పార్టీలోకి రావడం, పెరంబ్రా నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీకి దిగడం సంబంధిత వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది.

## మార్పు దిశగా...

1948లో స్థాపించిన ఐయుఎంఎల్‌కు కేరళలో, ప్రధానంగా మలబార్ ప్రాంతంలో మంచి పట్టుంది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, కర్ణాటకలో నామమాత్రమైన ఉనికి కూడా ఉంది. ఆ పార్టీ 1996లో, 2021లో కేరళలో మహిళలను పోటీలో నిలబెట్టింది. కానీ వారు ఓడిపోయారు. ఆ తరువాత... తాజా ఎన్నికల్లో ఇద్దరు మహిళలకు టిక్కెట్ ఇచ్చింది. వారిలో ఫాతిమా ఒకరు. సీపీఎం సీనియర్ నాయకుడు టి.పి.రామకష్ణపై ఆమె అయిదువేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచడం దిశగా ముస్లిం లీగ్‌లో మార్పులకు దోహదం చేసే పరిణామంగా... ఫాతిమా గెలుపునకు ప్రాధాన్యం ఉంది.

## అంట్లు తోమిన చేతులతో..

ఒక సామాన్య గృహ కార్మికురాలు ప్రజా ప్రతినిధిగా ఎదగడం అంటే అది గెలుపు మాత్రమే కాదు.. భారత ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనం. పశ్చిమ బెంగాల్‌లోని ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందిన కలితా మాఝీ ప్రస్థానం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## రూ. 2,500 జీతం నుంచి..

బహుశా ఏ రాజకీయ నాయకుడి అఫిడవిట్‌లోనూ ఇంత తక్కువ ఆస్తులు కనిపించవేమో! కలితా మాజీ దాదాపు రెండు దశాబ్దాలపాటు ఇళ్లలో పాచి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించారు. నెలకు కేవలం రూ. 2,500 సంపాదనతో జీవనం సాగించిన ఆమె నేడు తన నియోజకవర్గ ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించబోతున్నారు. 38 ఏళ్ల కలిత భర్త సుబ్రతా మాఝీ దినసరి కూలీ.

## ఓటమి నుంచి నేర్చుకున్న పాఠం

కలితా మాఝీ రాజకీయాల్లోకి ఒక్క రోజులోనే రాలేదు. గత దశాబ్ద కాలంగా బూత్‌స్థాయి కార్యకర్తగా పార్టీ కోసం పనిచేశారు. 2021 ఎన్నికల్లో బీజేపీ ఆమెకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆమె కుంగిపోలేదు. తన నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతూ క్షేత్రస్థాయిలో పట్టు సాధించారు. ఫలితంగా తాజా ఎన్నికల్లో మళ్లీ అవకాశం లభించింది. టీఎంసీ అభ్యర్థి శ్యామ ప్రసన్న లహోరీపై 12,535 ఓట్ల మెజారిటీతో అద్భుత విజయాన్ని అందుకున్నారు. ఆమెకు లక్షకు పైగా ఓట్లు రావడం ఆమె మంచితనానికి, పట్టుదలకు నిదర్శనం.

# కనీస వేతనాల పెంపుదల చారెడు! ప్రచారం మాత్రం బారెడు!!

**- టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం ధ్వజం**




(సమయం ప్రతినిధి అమరచింత): అమరచింత మార్క్స్ భవన్ లో శనివారం జరిగిన ప్రెస్ మీట్ లో TUCI రాష్ట్ర అధ్యక్షులు ఖ సూర్యం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కోటి 11 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచుతున్నానంటూ నిన్న ప్రకటన చేశారు. ప్రకటనలో గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు జోన్లుగా ప్రకటించడం, ప్రకటించిన వేతన పెంపులో సమగ్రత, స్పష్టత లేదు. అయితే ముఖ్యమంత్రి ప్రకటించిన దాంట్లో అనేక ప్రశ్నలు కార్మికుల ముందుకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లు ఉన్నాయి. వాటిల్లో ఐదు జీవోలకు 2021లో బేసిక్ వేతనం 18000గా నిర్ణయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దానిని తుంగ లో తొక్కారు. వాటి బేసిక్ వేతనం గురించి మాట్లాడ కుండా, కొత్త ప్రతిపాదనలతో ముందుకు రావడం అనేక అనుమానాల కు దారి తీస్తుంది. బేసిక్ వేతనాన్ని పెంచకుండా, వీడిఏకు సంబంధించిన ప్రకటన లేకుండా ఏక మొత్తంగా జీతాల పెంపకం ప్రకటించడంలో స్పష్టత లేదు, సమగ్రత అంతకన్నా లేదు. ముఖ్యమంత్రి చూపించిన వేతనాలు ఏ రంగ కార్మికుల కు వస్తున్నాయి అనేది కూడా చెప్పకుండా, వాటి మీద ఎక్కువ మొత్తంలో జీతాలు పెంచుతున్నట్టు ప్రకటించడం హాస్యాస్పదం గా ఉందన్నారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ జీవో 11 ప్రకారం నేడు అన్స్కిల్డ్ 13,098, సెమి స్కిల్డ్ - 14,287, స్కిల్డ్ - 15,476, హైలీ స్కిల్డ్ - 23,683 ప్రస్తుతం చెల్లిస్తున్నదని ముఖ్యమంత్రి ప్రకటించిన దాంట్లో రూ.20 వేలుగా ప్రకటించారన్నారు. దీనితో రూ.23,683 వస్తున్నా హైలీ స్కిల్డ్ 3,683లు కోత విధించారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో చేస్తున్న అన్ని ప్రాంతాల్లో అవుట్ సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులకి ఒకే వేతనం వారికి అమలు అవుతుంది. వివిధ కేటగిరీలలో ముఖ్యమంత్రి ప్రకటించిన దాని కంటే ఎక్కువే పొందుతున్నారని ప్రకటించిన జీవో అమల్లోకి వెళ్తే "కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్నట్టు" కార్మికుడు ఆల్రెడీ పొందుతున్న జీతం తగ్గిపోతుం దన్నారు.. కార్మికుడికి వేతనం ఏ స్థాయిలో పెరిగిందో స్పష్టత లేకపోవడం మూలంగా, ఇప్పుడు పొందుతున్న జీతం తప్పనిసరిగా తగ్గే అవకాశాలే మెండుగా ఉన్నాయి. గ్రామీణ కార్మికులు అంటే ఎవరు అనేది కూడా స్పష్టత లేదన్నారు.

కార్మిక సంఘాలు సుదీర్ఘకాలంగా కనీస వేతనం 26,000 ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. దానికి అనుగుణంగానే వేతన సవరణ చేయాలని టీయుసీఐ డిమాండ్ చేస్తున్నది. ధరల పెరుగుదల 200 శాతం దాటిన నేపథ్యంలో ముఖ్య మంత్రి ప్రకటనలోని వేతనాలు ఏ రకంగా? ఏ సిరీస్లో జీతాలు పెంచారానేది కూడా తెలియని అయోమయంలోకి కార్మిక వర్గాన్ని నెట్టింది. రాష్ట్రంలో వేతన సవరణ జరగక సంవత్స రాలు అవుతున్నది. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వేత నాలు పెరగటం లేదు ఈ స్థితిలో కార్మిక సంఘాల డిమాండ్ శాస్త్రీయంగా, సహేతుకంగా ఉన్నది. వేతనాల పెంపుదలకు డాక్టర్ ఆక్రాయిడ్ సూత్ర ఆధారంగా జీతాలు పెంచాలని టీయుసీఐ కోరుతున్నది. ఈ రాష్ట్రంలో ఉన్న మిగతా షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ జీవోలు ఏమవుతాయో కూడా పేర్కొనలేదు. వీడిఏ అమలు అవుతుందా లేదా అనే స్పష్టత కూడా లేదు. కావున, కార్మిక వర్గానికి అన్యాయం చేయకుండా ప్రస్తుతం పొందుతున్న వేతనాల పైననే కనీసం 2021 సం॥లో నిర్ణ యించిన రూ. 18 వేల పైనే జీతాలు పెంచడం, వీడిఎను అమలు చేయడం తప్పనిసరిగా ప్రభుత్వం చేయాలి. మూడు జోన్ల ప్రకటన కూడా అశాస్త్రీయమైనదని తెలియజేస్తున్నాం. 2021 సం॥లో రాష్ట్ర ప్రభుత్వం ఐదు జీవోల్లో బేసిక్ వేతనం 18 వేల రూపాయలను నిర్ణయించింది. దానిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుంగలో తొక్కింది. కనుక 21లో ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన జీవోల ప్రాతిపదికగా, మిగతా 68 షెడ్యూల్డ్ జీవోలకు వర్తింపచేయాలి, అని టీయుసీఐ డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగుల వేతనాల పెంపును (G.O.60) రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. ఈ కార్యక్రమంలో TUCI ఉమ్మడి జిల్లా నాయకులు జీచీ దేవదానం, P అరుణ్ కుమార్, సి రాజు, కోళ్ళ వెంకటన్న, కొండన్న, వెంకటేష్ గౌడ్‌లు పాల్గొన్నారు

## ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారితే?

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో భూమి ధరలు ఆకాశమే హద్దు అన్న చందంగా దూసుకుపోతున్నాయి. రాయదుర్గంలో ఎకరం రూ.237 కోట్లు పలికిందంటే అది కేవలం ప్రభుత్వ ఖజానాకు వచ్చిన ఆదాయం మాత్రమే కాదు, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే సగటు మనిషి ఆర్థిక స్థితిపై పడ్డ పెద్ద దెబ్బ. ప్రభుత్వం లాభాపేక్షతో భూములను కార్పొరేట్ సంస్థలకు వేలం వేయడం వల్ల, రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కృత్రిమమైన హైప్ సృష్టికి కారణం అవుతోంది. ఇది అంతిమంగా నిర్మాణ వ్యయం పెరగడానికి, తద్వారా సామాన్యుడికి సొంతింటిని అందని ద్రాక్షగా మార్చడానికి దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.సాధారణంగా ప్రభుత్వం భూములను ప్రజా అవసరాల కోసం స్కూళ్లు, ఆస్పత్రులు, పార్కులు , పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, గత కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఆదాయం కోసం భూములను మానిటైజేషన్ చేయడంపైనే దృష్టి పెట్టింది. రాయదుర్గం, కోకాపేట వంటి ప్రాంతాల్లో రికార్డు ధరలు పలకడం వల్ల పక్కనే ఉన్న గచ్చిబౌలి, నార్సింగి, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో కూడా భూమి రేట్లు అమాంతం పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన అప్‌సెట్ ప్రైస్ మార్కెట్‌లో ఒక కొత్త బెంచ్‌మార్క్‌గా మారుతోంది, దీనివల్ల ప్రైవేట్ భూముల ధరలు కూడా నియంత్రణ లేకుండా పెరిగిపోతున్నాయి.ఒకప్పుడు సామాన్యుడు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చిన్న ప్లాటో లేదా ఫ్లాటో కొనుక్కునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు అటువైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ఫ్లాట్ ధర కనీసం రూ.70 లక్షల నుండి రూ.1.5 కోట్ల వరకు పలుకుతోంది. ప్రభుత్వం భూములను వందల కోట్లకు విక్రయించడంతో, బిల్డర్లు ఆ ధరను భర్తీ చేయడానికి విలాసవంతమైన హై-రైజ్ అపార్ట్‌మెంట్‌లనే నిర్మిస్తున్నారు. దీనివల్ల అఫోర్డబుల్ హౌసింగ్ అనే కాన్సెప్ట్ హైదరాబాద్‌లో కనుమరుగైపోతోంది. మధ్యతరగతి ప్రజలు తమ జీవితకాల సంపాదనను ఇఎంఐ ల రూపంలో చెల్లించినా, ఒక చిన్న గూడు దక్కడం కష్టతరంగా మారుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ భూముల వేలం విధానంపై రాజకీయ విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తోందన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నాయి. అభివృద్ధి పేరుతో భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, సామాన్యుడిని నగరం వెలుపలికి తరిమేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. భూముల విలువలను పెంచి స్టాంప్ డ్యూటీ ద్వారా అదనపు ఆదాయం పిండుకోవడం వల్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. ఇది కేవలం ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికే తప్ప, సామాన్యుడి సంక్షేమం కోసం కాదనే వాదన బలంగా వినిపిస్తోంది.ధరలు ఇలాగే అసహజంగా పెరిగితే భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ బబుల్' ఏర్పడి మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కొనుగోలు శక్తికి మించి ధరలు పెరిగితే, ఇన్వెస్టర్లు వెనక్కి తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం కేవలం ఆదాయంపైనే కాకుండా, సామాన్యుల నివాస అవసరాల కోసం ఒక సమగ్ర గృహ నిర్మాణ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది. కేవలం ధనవంతులకు, ఐటీ కంపెనీలకే కాకుండా.. నగరంలో పనిచేసే సామాన్య కార్మికులు, ఉద్యోగులకు కూడా గూడు దక్కేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా ఎదగడం ఆహ్వానించదగ్గ పరిణామమే అయినా, అది సామాన్యుల కన్నీళ్ల మీద పునాదులు వేసుకోకూడదు. ప్రభుత్వం భూములను వేలం వేసి ఆదాయం సమకూర్చుకోవడం తప్పు కాకపోయినా, ఆ ఆదాయంలో కొంత భాగాన్ని తిరిగి పేద, మధ్యతరగతి గృహ నిర్మాణ పథకాలకు మళ్లించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. హైదరాబాద్ నగరంలో టీజీఐఐసి భూముల వేలం నిర్వహించింది. రాయదుర్గం ప్రాంతంలోని పాన్ మక్తా ఏరియాలోని సర్వేనెంబర్ 83/1 లో ఆరు ఎకరాల 29 గుంటల భూమికి వేలం వేస్తున్నారు.. ఎకరం భూమిని 237 కోట్లకు ఓ కంపెనీ కొనుగోలు చేసింది. ఇంకా ఈ భూమికి సంబంధించి వేలం జరుగుతున్న నేపథ్యంలో భారీగా సొమ్ములు ప్రభుత్వానికి సమకూరే అవకాశం కనిపిస్తోంది.గత ఏడాది ఇదే ప్రాంతంలో 7.6 ఎకరాలను ప్రభుత్వం వేలం వేసింది. అప్పుడు ఎకరం ధర 177 కోట్లు పలికింది. నాడు ప్రభుత్వానికి ఏకంగా 1357.59 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో ధర పలకడం విశేషం. హైదరాబాద్ నగరంలో పెద్దపెద్ద కంపెనీలు రియల్ ఎస్టేట్ వ్యవహారాలు సాగిస్తున్నాయి. భారీగా భవనాలను నిర్మిస్తున్నాయి. ముఖ్యంగా రాయదుర్గం.. మంచిరేవుల.. నార్సింగి.. కోకాపేట.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్.. నేక్నాం పుర వంటి ఏరియాలలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ ఎకరం ధర 100 కోట్లలో ఉంది. అందువల్లే ఇక్కడ భారీగా భవనాలను నిర్మించడానికి రియల్ ఎస్టేట్ కంపెనీలు ఆసక్తిని చూపిస్తున్నాయి. ఫార్మా కంపెనీలు.. ఫైనాన్షియల్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు ఇక్కడ శాశ్వత నివాసం ఏర్పరచుకుంటున్నారు. అందువల్లే ఇక్కడ నివాస సముదాయాలకు విపరీతమైన డిమాండ్ ఉంది.

## ఒక్కసారిగా పెరిగిన కాఫీ డే షేర్లు

బెంగళూరు : కర్ణాటక రాజకీయాల్లో చోటుచేసుకున్న తాజా పరిణామాలు స్టాక్ మార్కెట్‌పై ఊహించని ప్రభావాన్ని చూపించాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా వార్తల నేపథ్యంలో ప్రముఖ కాఫీ చైన్ సంస్థ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ షేర్లు ఏకంగా 20 శాతం వరకు ఎగసిపడి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోవడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా కొత్త సమీకరణాలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాల నేపథ్యంలో ఆయన రాజీనామా చేసినట్లు వార్తలు రావడంతో.. తదుపరి ముఖ్యమంత్రిగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేరు బలంగా వినిపిస్తోంది. ఈ వార్త వ్యాపార వర్గాల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. దీనికి ప్రధాన కారణం కాఫీ డే వ్యవస్థాపకుడు దివంగత వీజీ సిద్ధార్థ కుటుంబంతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధాలే. వీజీ సిద్ధార్థ కుమారుడు అమర్త్య హెగ్డేకు డీకే శివకుమార్ తన కుమార్తె ఐశ్వర్యను వివాహం చేయడం తెలిసిందే.డీకే శివకుమార్ సీఎం అయితే కాఫీ డే సంస్థకు మళ్లీ పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందని మదుపరులు భావిస్తున్నారు. దీంతో మార్కెట్ ప్రారంభమైన వెంటనే పెట్టుబడిదారులు భారీగా షేర్ల కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా కంపెనీ షేర్లు ఒక్కసారిగా 20 శాతం వరకు లాభపడి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ఒక రాజకీయ పరిణామం ప్రభావంతో ఒక కంపెనీ షేర్లు ఇంత వేగంగా పుంజుకోవడం మార్కెట్ వర్గాలను కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. గత కొంతకాలంగా కాఫీ డే సంస్థ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. వీజీ సిద్ధార్థ మరణానంతరం సంస్థ కార్యకలాపాలు కొంత మందగించాయి.అయితే ఇప్పుడు ఆ కుటుంబానికి అత్యంత దగ్గర వ్యక్తిగా భావించే డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కనిపించడం కంపెనీకి నైతికంగా, వ్యాపారపరంగా బలం చేకూరుస్తుందని పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు కూడా వ్యాపారాలకు అనుకూలంగా ఉండొచ్చన్న అభిప్రాయం మార్కెట్లో వినిపిస్తోంది. ముఖ్యంగా పర్యాటక, రిటైల్, హాస్పిటాలిటీ రంగాలకు కొత్త ప్రభుత్వం ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో కాఫీ డే వంటి రిటైల్ బ్రాండ్‌లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం కలిగే అవకాశముందని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు.రాజకీయాలు, వ్యాపార రంగాల మధ్య ఉన్న అనుబంధానికి ఈ పరిణామం తాజా ఉదాహరణగా మారింది. డీకే శివకుమార్ అధికారికంగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడితే కాఫీ డే షేర్లలో మరింత కదలిక కనిపించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.




## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం

**శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**
**అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది**
**అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం**

నాగర్ కర్నూల్ ప్రతినిధి : వివిధ శాఖల పనుల పురోగతిపై సమీక్ష జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జూన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులు, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన, విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి తదితర కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నేపథ్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులన్నీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పర్యవేక్షించాలని, నాసిరకం పనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వవద్దని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఆ దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, గడువులోపు పూర్తి కాని పనులపై సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారిస్తామని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొండారెడ్డిపల్లిని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, కేవీ నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయం, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి రాజేశ్వరి ,వివిధ జిల్లా , నియోజకవర్గం,మండల స్థాయి శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# చరిత్రలో నిలిచిపోయేలా పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం: మంత్రి ఉత్తమ్

## అడివి అజిలాపూర్ లిఫ్ట్‌కు శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి

**(సమయం ప్రతినిధి దేవరకద్ర) :** చరిత్రలో నిలిచిపోయేలా పాలమూరు జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామని అడివి అజిలాపూర్ సభలో మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. దేవరకద్ర మండలం అడవి అజిలాపూర్ వద్ద 32 కోట్ల 5 లక్షల నిధులతో అడవి అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ కు స్థానిక దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR)తో కలసి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు శ్రీ. వాకిటి శ్రీహరి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... నెల్విడి, శ్రీ కురుమూర్తి రాయ, సరళ సాగర్ ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులకు నిధు లు మంజూరు చేసినందుకు మరియు అజిలాపూర్ లిఫ్ట్ మంజూరు చేసినందుకు గాను ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి ధన్య వాదాలు తెలియజేశారు. అదేవిధంగా కోయిల్ సాగర్ పెండిం గ్ పనులకు 150 కోట్లు మంజూరు చేయాలని, చౌదర్పల్లి లిఫ్టును మంజూరు చేయాలని, దానికి సంబంధించి ఇప్పటికే 87 కోట్ల రూపాయల నిధుల అంచనా వ్యయంతో ప్రతిపా దనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, చౌదర్పల్లి లిఫ్ట్ కు అనుమతులు ఇవ్వాలని, మంత్రిగని కోరారు, ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు.





అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.... నీటిపారుదల రంగంలో ఈ టర్మ్‌లో చరిత్రలో నిలిచిపోయేలా అద్భుతమైన పనులు చేస్తామని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.వచ్చే నెల జూన్ 4, 5 తేదీలలో సీఎం. రేవంత్ రెడ్డి తో కలిసి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను స్వయంగా పరిశీలిస్తామన్నారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఎన్ని వేల కోట్ల రూపాయలైనా ఖర్చు పెట్టడానికి మా ప్రభుత్వం వెనకడదాని తెలిపారు.గత పాలకులకు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న శ్రద్ధ.. పాలమూరు ప్రాజెక్టులపై లేదని మండిపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందని బిఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్తున్నారని ధ్వజమెత్తారు. జిల్లా ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ క్లియర్ చేసి, పనులను వేగవంతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ టర్మ్ లోనే కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు ఎత్తిపోతల పథకం తదితర పనులన్నింటినీ పూర్తి చేసి, పాలమూరు గడ్డను సస్యశ్యామలం చేస్తామని, దానికి సంబంధించి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేస్తామని మంత్రి జిల్లా ప్రజలకు భరోసా ఇచ్చారు. తదనంతరం రాజమూర్ సమీపంలో వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే జియంఆర్‌తో కలిసి మంత్రివర్యులు పరిశీలించి, కొనుగోలు ప్రక్రియపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు, ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియపై రైతుల హర్షం వ్యక్తం చేసి, నిరంతరం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో కోయిల్ సాగర్, అడివి అజిల పూర్ గ్రామాలకు చెందిన ప్రస్తుత ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు... ఎమ్మెల్యే జియంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.







OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085